# మద్దూరు మోడల్ స్కూల్‌లో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు







**-డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలపై దృష్టి సారించాలి-**

**-మద్దూరు ఎస్ఐ ఎం.డి. అసిఫ్**

మద్దూరు, జూన్ 22 (హిందుస్థాన్ మీడియా):

సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మద్దూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ మోడల్ స్కూల్‌లో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మద్దూరు ఎస్ఐ ఎం.డి. అసిఫ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ అసిఫ్ మాట్లాడుతూ, ంమాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సమాజపరంగా తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతాయని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే స్పందించాలని సూచించారు. మాదకద్రవ్యాల కొనుగోలు, విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, ఎన్‌డీపీఎస్ (NDPS) చట్టం ప్రకారం కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని వివరించారు.డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు మద్దూరు పోలీసులు కట్టుబడి ఉన్నారని, సమాజంలోని ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎస్ఐ అసిఫ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలతో జీవితాలను చీకటిమయం చేసుకోవద్దు







**-శ్రీ గాయత్రీ, వికాస్ స్కూళ్లలో యాంటీ-డ్రగ్స్ అవగాహన సదస్సువిద్యార్థుల భవిష్యత్తుపై పోలీసుల ప్రత్యేక దృష్టి**

**-చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్**

చేర్యాల, జూన్ 22 (హిందూస్థాన్ మీడియా):

విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చేర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) బానోతు రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం చేర్యాల పట్టణంలోని శ్రీ గాయత్రీ స్కూల్, వికాస్ స్కూల్‌లలో మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో చేర్యాల సీఐ రమేష్ నాయక్, ఎస్ఐ అపూర్వరెడ్డి పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలతో సర్వనాశనం ఈ సందర్భంగా సీఐ రమేష్ నాయక్ మాట్లాడుతూ, క్షణికానందాల కోసం డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వైపు అడుగులు వేస్తే జీవితాలు అంధకారంలోకి నెట్టబడతాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, చదువుపై ఏకాగ్రత తగ్గి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మక అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. చట్టాలు కఠినం -- అప్రమత్తంగా ఉండాలి ఎస్ఐ అపూర్వరెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, నిల్వ, వినియోగం చట్టరీత్యా తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ఏవైనా అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వెంటనే స్పందించాలని సూచించారు. పట్టణంలో ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అవగాహన డ్రైవ్ చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో శ్రీ గాయత్రీ, వికాస్ పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది మరియు వందలాది మంది విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వంగపల్లి - ఉప్పరోనిగడ్డకు బస్సు సౌకర్యం ప్రారంభించిన సర్పంచ్ రామస్వామి!

**-ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చొరవతో చేర్యాల నుండి నూతన ఆర్టీసీ సర్వీస్ షురూ**

**-విద్యార్థులు, గ్రామస్థుల రవాణా కష్టాలకు చెక్.. జనగామ డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు**

మద్దూరు/వంగపల్లి (హిందూస్థాన్ మీడియా):

మద్దూరు మండల పరిధిలోని వంగపల్లి, ఉప్పరోనిగడ్డ గ్రామస్థులు, విద్యార్థుల దశాబ్దాల రవాణా కష్టాలకు తెరపడింది. జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతో చేర్యాల నుండి వంగపల్లి – ఉప్పరోనిగడ్డ వరకు నూతన ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటైంది. సోమవారం ఉదయం గ్రామ కేంద్రంలో వంగపల్లి సర్పంచ్ కొమిరె రామస్వామి ఈ నూతన సర్వీస్‌ను ఘనంగా ప్రారంభించారు.

**-ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తక్షణ స్పందన..**

చేర్యాల నుండి వంగపల్లి, ఉప్పరోనిగడ్డ గ్రామాలకు సరైన బస్సు రవాణా సౌకర్యం లేకపోవడంతో నిత్యం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వందలాది మంది విద్యార్థులు, పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్లే కూలీలు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గమనించిన వంగపల్లి గ్రామ సర్పంచ్ కొమిరె రామస్వామి ఇటీవల స్థానిక రవాణా ఇబ్బందులను వివరిస్తూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే.. జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ కు ప్రత్యేకంగా లేఖ రాసి బస్సు సర్వీస్ నడపాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి దిగిన డిపో మేనేజర్ సోమవారం నుంచే చేర్యాల – వంగపల్లి – ఉప్పరోనిగడ్డ మార్గంలో బస్సు సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చారు.

**-విద్యార్థులకు పెను భరోసా.. సద్వినియోగం చేసుకోవాలి:**

ఈ సందర్భంగా సర్పంచ్ కొమిరె రామస్వామి మాట్లాడుతూ.. చేర్యాల పట్టణానికి వెళ్లే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ బస్సు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సురక్షితమైన ప్రయాణం కోసం గ్రామ ప్రజలంతా ఈ ప్రభుత్వ



ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను నిరంతరం సద్వినియోగపరచుకోవాలని కోరారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి రవాణా కష్టాలు తీర్చిన జనగామ ఎమ్మెల్యే శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి కి, ఆర్టీసీ డిపో మేనేజర్ కి వంగపల్లి, ఉప్పరోనిగడ్డ గ్రామ పంచాయతీ పాలకవర్గం మరియు గ్రామస్థుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి మరియు ఉప్పరోనిగడ్డ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఆర్టీసీ సిబ్బంది (డ్రైవర్, కండక్టర్), స్థానిక యువత మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# తపస్పల్లి రిజర్వాయర్లో ముంపుకు గురవుతున్న ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వాలి

**-భూములు 20 సంవత్సరాలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం రాక ఇబ్బందులు**

**-మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సిద్దిపేట జిల్లా ఎక్స్ డైరెక్టర్ తేలు ఇస్తారి వినతి పత్రం అందజేత**

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామం తపస్పల్లి రిజర్వాయర్ లో ముంపుకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కొమురవెల్లి మండలానికి వచ్చిన ఇరిగేషన్ సిద్దిపేట జిల్లా డిఈ కి సోమవారం రోజు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నష్టపోతున్న రైతుల పక్షాన ఫిషరీస్ కోపరేట్ సొసైటీ జిల్లా ఎక్స్ డైరెక్టర్ డైరెక్టర్ తేలు ఇస్తారీ వినత పత్రం ఇచ్చి రిజర్వాయర్ పరిశీలించి నష్టపోతున్న ప్రతి రైతుకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తేలు పెద్దలు మొగుళ్ల చంద్రం రాజిరెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఈ రహిమాన్



కాలువల అసిస్టెంట్లు డ్యాం పై పనిచేసే వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డిఈ అంజయ్య అందరికీ నష్టపరిహారం వచ్చే విధంగా చూస్తానని వారు అన్నారు.

# లక్ష్మీపూర్‌లో ఘనంగా అక్షరాభ్యాస మహోత్సవం

**-బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం**

లక్ష్మీపూర్, జూన్ 22 (హిందూస్తాన్ మీడియా):



లక్ష్మీపూర్ మండల ప్రాథమిక పాఠశాలలో "బడిబాట" కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యా ప్రస్థానానికి తొలి అడుగుగా భావించే ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు షాబుద్దీన్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులు, గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షరాలు దిద్దించి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించారు. పాఠశాల ఆవరణం చిన్నారుల సందడి, తల్లిదండ్రుల ఆనందంతో కళకళలాడింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడుల అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. "ప్రభుత్వ బడి -- మనందరి బాధ్యత" అనే నినాదంతో గ్రామస్థులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్య కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

# కేజీబీవీ జూనియర్ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**-అర్హులైన మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలి : ఎంఈఓ నరేందర్**

చేర్యాల, జూన్ 22 (హిందుస్థాన్ మీడియా):

చేర్యాల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (KGBV) జూనియర్ కాలేజీలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన బోధన సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేర్యాల మండల విద్యాధికారి (ఎంఈఓ) నరేందర్ తెలిపారు.ఈ నియామకాల్లో ఇంగ్లీష్ మరియు నర్సింగ్ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంగ్లీష్ పోస్టుకు పీజీతో పాటు బీఈడ్ (ఇంగ్లీష్ మెథడాలజీ) అర్హత ఉండాలని, నర్సింగ్ పోస్టుకు పీజీ నర్సింగ్ లేదా అనుభవం కలిగిన బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అర్హులైన అభ్యర్థులు జూన్ 24, 25 తేదీలలో చేర్యాల కేజీబీవీ జూనియర్ కాలేజీలో నిర్వహించే ఇంటర్వ్యూలకు అవసరమైన విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 6301779169 నంబర్‌ను సంప్రదించవచ్చని ఎంఈఓ నరేందర్ తెలిపారు.

## లక్ష్యంతో కూడిన ప్రణాళికలు రూపొందించి ఉత్తమ ఫలితాలు సాధించాలి ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సమీక్ష

**-జిల్లాలోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి**

**-రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్**

జూన్ 22 (హిందుస్థాన్ మీడియా)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలు పై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సోమవారం జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన రాబోయే పరీక్షల కోసం ఇప్పటి నుంచే లక్ష్యంతో కూడిన ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పూర్తిగా అందాయా అని ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు, కోడిగుడ్ల సరఫరా, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, బోధన నిర్వహణపై ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్న ఆమె, గత సంవత్సర ఎస్ఎస్సి ఫలితాల పై జిల్లా విద్యాశాఖాధికారి నుండి సమాచారం సేకరించారు. అనంతరం పాఠశాలలోని డైనింగ్ హాల్, మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించారు. ఎం.డీ.ఎం నిర్వాహకులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహణ చేపట్టాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో కిచెన్ గార్డెన్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించిన ఆమె, మధ్యాహ్న భోజన పథక నిర్వహణలో ఎల్పీజీ గ్యాస్ వినియోగంపై కూడా వివరాలు తెలుసుకున్నారు. చివరగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యను జీవితం లో అత్యంత విలువైన సంపదగా భావించి క్రమశిక్షణ తో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని సిక్త పట్నాయక్ ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఆరోగ్య కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు. తదుపరి మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరియు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ పురోగతి, ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం గురించి వివరాలు తెలుసుకున్నారు. పూర్తయిన ఇళ్లను సందర్శించి పరిశీలించి, ఇళ్లు ఎంతో నాణ్యంగా మరియు ఆకర్షణీయంగా నిర్మించబడినట్లు అభినందించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను కూడా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము, డిపిఓ మదన్మోహన్, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

